క్లుప్తంగా

సీపీఓ కార్యాలయాన్ని ఆదర్శంగా తీసుకోండి



సీపీఓ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్): కార్యాలయాల నిర్వహణ, పునర్నిర్మాణ పనుల విషయంలో సీపీఓ కార్యాలయాన్ని ఆదర్శంగా తీసుకోవాలని డీఆర్ఓ, డీఎస్ఓలకు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సూచించారు. శుక్రవారం ఆమె డీఆర్వో కార్యాలయం, దాని అనుబంధ సెక్షన్లు, డీఎస్ఓ, సీపీఓ కార్యాలయాలను పరిశీలించారు. అయితే, డీఆర్వో, డీఎస్ఓ కార్యాలయాల్లో అపరిశుభ్రత నెలకొని ఉండడం, రెనోవేషన్ పనులు నెమ్మదిగా సాగుతుండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు(సెంట్రల్) : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..విద్యుత్ మీటర్లకు పీస్ రేటు విధానాన్ని కొనసాగిస్తున్నారని, అది కూడా తగ్గించి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే పీసు రేటు విధానాన్ని రద్దు చేసి కనీస వేతనం ఇవ్వాలన్నారు. మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ అనంతపురం నుంచి కర్నూలు వరకు ఈనెల 27,28 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, హదీద్, వీరేష్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

28న చంద్రగ్రహణ పూజ

కర్నూలు కల్చరల్: ఆస్పరి మండలం హలిగెర గ్రామ పరిధిలోని స్వయంభు నల్లగుట్ట శ్రీ హరి కూర్మ క్షేత్రంలో ఈనెల 28వ తేదీన చంద్రగ్రహణ పూజలు నిర్వహిస్తున్నట్లు క్షేత్ర నిర్వాహకులు నరేష్ పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల చెక్ పోస్ట్ సమీపంలోని శ్రీకృష్ణ ఆలయంలో పూజలకు సంబంధించిన కరపత్రాలు, బ్యానర్లను పలువురు ధార్మిక సంస్థల ప్రతినిధులు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహిమాన్వితమైన శ్రీ కూర్మ క్షేత్రంలో చంద్ర గ్రహణ సమయంలో ప్రత్యేక పూజలు, స్నానాలు, అభిషేకాలు, గిరి ప్రదక్షిణలు ఉంటాయన్నారు. అనంతరం శ్రీ కూర్మ క్షేత్రానికి సంబంధించి పాటలు రాసి శ్రీ కూర్మ నారాయణస్వామికి అంకితం చేసిన మధుర కవి ఎలమర్తి రమణయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, బంజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, ఆదర్శ విద్యా సంస్థల అధినేత తిమ్మయ్య యాదవ్, బీజేపీ నాయకులు హరీష్‌బాబు, సభ్యులు శ్రీనివాసులు, అయ్యన్న యాదవ్, రఘునందన్, మన్మధరావు, నాగరాజు, ప్రభాకర్ యాదవ్, నాగరాజు, నారాయణ, తదితరులు ఆవిష్కరణలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉపాధ్యాయుల రిలే దీక్షలు

కర్నూలు(సెంట్రల్) : పాత పెన్షన్ కోసం ఐక్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. రెండో రోజు పలు సంఘాల నాయకులు మద్దతు ప్రకటించాయి. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు మద్దతు ప్రకటించి మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం కొనసాగించాలన్నారు. జీపీఎస్‌కు ఎవరూ ఒప్పుకోరని చెప్పారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు

కర్నూలు (టౌన్) : నగరంలో మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సీనియర్ ఎంటమాలజిస్టు వెంకటేశులు అన్నారు. శుక్రవారం స్థానిక నగరంలోని బుధవారపేటలోని 36, 37 సచివాలయాల పరిధిలో నగరపాలక మలేరియా విభాగం ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. నిలువ ఉన్న నీటిని తొలగించి పిచికారీ చేశారు. క్రైస్తవ శ్మశాన వాటిక, చర్చి లైన్, ముస్లిం ఏరియా, మాలగేరి, హిందూ శ్మశాన వాటిక, విరుపాక్షయ్య తోట ప్రాంతాల్లో డెంగీ, మలేరియా వ్యాధులపై స్థానిక కాలనీవాసులకు అవగాహన కల్పించారు. పరిశుభ్రత పాటించాలని సూచించారు.

సుధాకర్‌బాబు సేవలు సద్వినియోగం చేసుకుంటాం

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సుధాకర్‌బాబు సేవలను జిల్లాలో పార్టీ అభివృద్ధికి వినియోగించుకుంటామని డీసీసీ అధ్యక్షుడు ఎం.బాబురావు అన్నారు. శుక్రవారం ఆయన నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ, పీసీసీ అధికార ప్రతినిధి కరుణాకరబాబుతో కలిసి సుధాకర్‌బాబును ఆయన నివాసంలో కలిసి సన్మానించారు.

పీఏసీఎస్‌ల బలోపేతానికి చర్యలు

- కల్లూరు పీఏసీఎస్‌కు ఉన్న విలువైన స్థలాన్ని సొసైటీ అభివృద్ధికి వినియోగించాలి
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- సొసైటీ అభివృద్ధికి డీసీసీబీ ద్వారా అన్ని విధాల సహకరిస్తాం
- చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి
- కల్లూరు పీఏసీఎస్ కాంపౌండ్‌వాల్ ప్రారంభోత్సవం



కాంపౌండ్‌వాల్‌కు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, డీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరి తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్)/కల్లూరు: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి నిర్మించిన కాంపౌండ్‌వాల్‌ను జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరితో కలసి ప్రారంభించి సొసైటీ స్థలంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే మాట్లాడుతూ... కల్లూరు పీఏసీఎస్‌కు దాదాపు 30 సెంట్ల విలువైన స్థలం ఉందని, దీనిని ఖాళీగా ఉంచకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫంక్షన్ హాల్ లేదా గోదాము వంటి నిర్మాణాలు చేపడితే పీఏసీఎస్‌కు లాభసాటిగా ఉంటుందని తెలిపారు. రైతుల అభ్యున్నతికే సొసైటీలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. అలాగే తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సొసైటీల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రభుత్వం సొసైటీలను మల్టీపర్పస్ సర్వీస్ సెంటర్లుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉందన్నారు. కల్లూరు పీఏసీఎస్ అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తామని చెప్పారు. ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి మాట్లాడుతూ.... ప్రతి పీఏసీఎస్‌ను ఆర్థికంగా బలోపేతం చేయడానికి డీసీసీబీ ప్రత్యేక చొరవ తీసుకుంటోందని చెప్పారు. కల్లూరు పీఏసీఎస్‌కు సంబంధించిన ఖాళీ స్థలం అభివృద్ధికి డీసీసీబీ సహకరిస్తుందని తెలిపారు. సొసైటీలను లాభాల బాట పట్టించాలన్నదే తమ ఉద్దేశమని, ఇందులో భాగంగానే మల్టీపర్పస్ గోదాములు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రైతులకే కాకుండా అన్ని వర్గాల వారికి రుణాలు ఇస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకుని సకాలంలో తిరిగి చెల్లించాలని పేర్కొన్నా రు. ప్రస్తుతం విద్యారుణాలు కూడా రూ.40 లక్షల వరకు ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుకారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకట రమణారెడ్డి, జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు, కార్పొరేటర్లు లక్ష్మీకాంతరెడ్డి, వెంకటేశ్వర్లు, సబ్ డివిజన్ సహకార అధికారి నాగరమణయ్య, డీసీసీబీ డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, కల్లూరు సొసైటీ సీఈఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ అర్హులకు జగనన్న ప్రోత్సాహకాలు

కర్నూలు (అర్బన్): యూపీఎస్సీ నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వెనుకబడిన వర్గాలు, ఆర్థికంగా బలహీనులైన వారికి జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కింద నగదును అందించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె.రంగలక్ష్మీ దేవి తెలిపారు. జీఓ ఎంఎస్ నంబర్ 58 ప్రకారం సామాజికంగా, ఆర్థికంగా, విద్య పరంగా ఆయా వర్గాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు ఆమె శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన వారికి రూ.లక్ష, మెయిన్స్ పరీక్షలో అర్హత సాధించిన వారికి రూ.50 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 2023లో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. jnanabhumi.ap.gov.in పోర్టల్‌లో అందించిన వెబ్‌లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తును నమోదు చేసి నవంబర్ 4వ తేదీలోగా పంపాలని ఆమె కోరారు. ఇందుకు సంబంధించి సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయకృష్ణన్ ఉత్తర్వులు జారీ చేశారని జేడీ వెల్లడించారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



వైద్య శిబిరంలో మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 21వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో అందిస్తున్న సేవలను, కల్పించిన వసతులను ఎమ్మెల్యే పరిశీలించి ఎమ్మెల్యే మాట్లాడారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా విద్య, వైద్యానికి సర్కారు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ రెండు ప్రజలకు ఉచితంగా అందిస్తుందన్నారు. ఇప్పటికే ఫ్యామిలీ ఫిజిషియన్ పేరుతో నెలలో రెండు సార్లు ఇంటి దగ్గరకు డాక్టర్లు వచ్చి ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఊరూరా ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అరుణ, నాయకులు బాలచంద్రరెడ్డి, సుకుమార్, ధర్మ, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- డీఆర్వో కె.మధుసూధనరావు



ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగుల స్పందనలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వో కె.మధుసూదనరావు అధికారులకు ఆదేశించారు. శుక్రవారం లెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఉద్యోగుల స్పందనలో ఉద్యోగుల నుంచి జెడ్పీ సీఈఓ నాసరరెడ్డితో కలసి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ఒకవేళ పరిష్కరించలేకపోతే కారణాలు అర్జీదారుడికి చెప్పాలన్నారు. కాగా, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో చర్యలు తీసుకోవడానికి వీలు లేకపోతే రాష్ట్ర స్థాయి అధికారులకు పంపవచ్చాన్నారు. అయితే ఆర్థికేతర కారణాలతో కూడిన అర్జీలను కచ్చితంగా పరిష్కరించేందుకు వీలు ఉంటుందన్నారు. గతంలో ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరేందుకు ఇబ్బంది పడేవారని, ప్రస్తుతం ప్రతినెలా మూడో శుక్రవారం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడంతో ఇబ్బంది లేకుండా ఉందన్నారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పందన వినతుల్లో కొన్ని.

- సర్వీసు రిజిస్టర్ ఇప్పించాలని కోరుతూ జిల్లా పౌరసరఫరాల శాఖలో పనిచేస్తున్న అటెండర్ బి.వి జయకుమార్ విన్నవించారు.
- ఆదోని ఏరియా హాస్పిటల్ బ్లడ్ బ్యాంకులో 16 ఏళ్లుగా పనిచేస్తున్నాని, ప్రస్తుతం మా తల్లిదండ్రులు వృద్ధులు కావడంతో వారిని చూసుకోవడానికి అనువుగా మా సొంతూరు బేతంచెర్లకు బదిలీ చేయాలని మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్ అస్లాంబాషా కోరారు.
- ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వర్తింపజేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మునిసిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే వర్కర్లు కోరారు.

అవీ-ఇవీ

టెండర్ల గడువు పొడిగింపు
కర్నూలు (న్యూసిటీ) : జిల్లాలోని ఆస్పరి, పెద్దకడబూరు మండల కేంద్రాల్లో పీహెచ్‌యూ (పబ్లిక్ హెల్త్ యూనిట్లు) భవన నిర్మాణాలకు టెండర్ల గడువును ఈ నెల 28వ తేదీ వరకు పొడిగించినట్లు ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగరాజు తెలిపారు. రెండు పీహెచ్‌యూ నిర్మాణాలకు రూ.67.1 కోట్లతో టెండర్లు ఆహ్వానించామని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆ జీవోలను రద్దు చేయాలి
కర్నూలు(సెంట్రల్) : ఆటో కార్మికులకు శాపంగా మారిన జీఓలు 21,31ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లాకార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని నందికొట్కూరు రోడ్డు ఓమేగా ఆసుపత్రి పక్కన ఏర్పాటు చేసుకున్న స్టాండ్ నుంచి సుమారు 100 మంది కార్మికులు సీఐటీయూలో చేరారు. ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ న్యూసిటీ ప్రధాన కార్యదర్శి బి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు
కర్నూలు కల్చరల్: జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి డాక్టర్ హేమలత అన్నారు. శుక్రవారం మునగాలపాడులో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు. సేవలపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలో డ్రై డే - ఫ్రై డే కార్యక్రమాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. వైద్య నిపుణులు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సామాజిక ఆరోగ్య అధికారులు, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారిశాలకు రూ.కోటి విరాళం
కల్లూరు: అమ్మవారి శాలకు సంబంధించిన నూతన అతిథి గృహం నిర్మాణానికి టీజీవీ సంస్థల చైర్మన్ టీజీ భరత్ రూ.కోటి విరాళం ప్రకటించారు. శుక్రవారం నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి శాలకు వెళ్లిన ఆయన రూ. 50 లక్షల చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో వాసవి సేవా ట్రస్ట్ చైర్మన్ సి.రాజశేఖర్, ఇల్లూరు రంగనాయకులు, ఇల్లూరు లక్ష్మయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యానికి సాహిత్యం దోహదం
కర్నూలుకల్చరల్: సామాజిక చైతన్యానికి సాహిత్యం దోహద పడుతుందని పలువురు సాహితీ వేత్తలు పేర్కొన్నారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో శుక్రవారం టీజీవీ కళాక్షేత్రంలో గుంటూరు శేషేంద్ర శర్మ 96వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి గౌరవా ధ్యక్షుడు బసవరాజు, జిల్లా అధ్యక్షుడు ఆవుల బస ప్ప, కవులు పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల హక్కులను కాపాడుకుందాం
కర్నూలు (న్యూటౌన్): గిరిజన ఉద్యోగుల హక్కులను కాపాడుకుందామని ఆల్ ఇండియా గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బి.మద్దిలేటి అధ్యక్షతన గిరిజన ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ గిరిజనుల హక్కుల సాధనకై నవంబర్ 12వ తేదీన విశాఖపట్టణంలో, 19వ తేదీన విజయవాడలో, 26వ తేదీన కర్నూలులో ప్రాంతీయ సదస్సు జరుగుతుందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ రామునాయక్, రాష్ట్ర కోశాధికారి జి. వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు మద్దిలేటి, రమేష్, బి. మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

భార్యతో గొడవ పడి వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు (టౌన్): భార్యతో గొడవ పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నగరంలోని స్థానిక గణేష్‌నగర్‌లో ఇంతియాజ్ ఉల్లాఖాన్ (39), బషీర్ ఖాతూన్ దంపతులు నివసిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇంతియాజ్ ఖతార్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో మేనేజర్‌గా చేస్తున్నాడు. సంవత్సరానికి ఒకసారి ఇంటికి వచ్చేవాడు. ఇటీవల ఖతార్ నుంచి వచ్చిన ఆయన శుక్రవారం భార్యతో గొడవ పడ్డారు. దీంతో ఆమె బంధువుల ఇంటికి వెళ్లి పోయింది. దీంతో మనస్తాపానికి గురైన అతను ఇంట్లో ఉరి వేసుకున్నాడు. ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో ఇంతియాజ్ తమ్ముడు అజ్మతుల్లాఖాన్ ఇంటికి వచ్చి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దించగా అప్పటికే మృతి చెందాడు. మూడవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

కర్నూలు (న్యూసిటీ): మైనింగ్ శాఖ అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం ఆదోని మండలం ఎస్.కొండాపురం ఎర్ర కొండల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారనే సమాచారంతో వెళ్లి తనిఖీ చేశారు. ఓ టిప్పర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశారు. అలాగే పత్తికొండలోని ప్యాపిలి రోడ్డులో ఎర్ర కొండలు, బుడిదగుండ్లు ప్రాంతాల్లో అక్రమార్కులు కొండలను తవ్వి మట్టి తరలించి ఆ స్థలాలను ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు రావడంతో మైనింగ్ అధికారులు తనిఖీ చేసి విచారించారు. ఎవరైనా ఆ ప్రాంతాల్లో తవ్వకాలు జరిపి తే కేసులు నమోదు చేస్తామని డీడీ హెచ్చరించారు.

నాలుగు లారీలు సీజ్

కర్నూలు (న్యూసిటీ): నన్నూరు టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా నాపరాయిని తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేశామని జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుంటూరు జిల్లా బాపట్ల నుంచి గ్రానైట్ స్లాబ్‌లు రవాణా చేస్తున్న రెండు లారీలను కోడుమూరు దగ్గర అధికారులు తనిఖీ చేసి పట్టుకున్నారని చెప్పారు. తనిఖీలో విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, మైనింగ్ సిబ్బంది ఉన్నారు.

పారదర్శకంగా పథకాల అమలు



మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నామని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక 47వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ధర్మపేట కాలనీలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల మంజూరు, చేకూరిన లబ్ధిని వివరించారు. అలాగే కాలనీవాసుల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ఆపార్టీ నాయకులు, జన్మభూమి కమిటీల సభ్యులు చెప్పిన వారికే పథకాలు దక్కేవన్నారు. ఇప్పుడు తమ ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ డిప్యూటీ మేయర్ అరుణ, నాయకులు ప్రసాద్, భారతి, సుధాకర్, సందీప్, లక్ష్మన్, లాజర్, బాషా, నాగరాజు, నజీర్, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలి



చిన్నారికి అందుతున్న ఆరోగ్యసేవల గురించి తెలుసుకుంటున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): స్పెషల్ న్యూ బార్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ)లో చికిత్స పొందుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎస్ఎన్‌సీయూతో పాటు పోషకాహార పునరావాస కేంద్రాన్ని (ఎన్ఆర్‌సీ) తనిఖీ చేశారు. పోషకాహారలోపంతో ఎన్ఆర్‌సీకి వచ్చిన పిల్లలకు అందుతున్న ఆరోగ్య సేవలు, పోషకాహారం గురించి ఆరా తీశారు. పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకు ఇప్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎస్ఎన్‌సీయూలో అందుతున్న ఆరోగ్య సేవలను పరిశీలించిన ఆయన అక్కడి పిల్లల రికార్డులు తనిఖీ చేశారు. ఆయన చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ విజయానందబాబు, ఎన్ఆర్‌సీ నోడల్ అధికారి డాక్టర్ మల్లికార్జున, స్టాటిస్టికల్ ఆఫీసర్ హేమసుందరం, హెచ్ఈఈఓ శ్రీనివాసులుశెట్టి ఉన్నారు.

ఈ రోజు

ప్రత్యేక విద్యుత్ అదాలత్
కర్నూలు (రాజ్‌విహార్) : వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు శనివారం ప్రత్యేక విద్యు త్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కర్నూ లు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు స్థానిక కొత్త బస్టాండ్ వద్ద ఉన్న విద్యుత్ భవన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి (రిటైర్డ్ జడ్జి), సభ్యులు కె.రామమోహన్ రావు, ఎల్.అంజని కుమార్, జి.ఈశ్వరమ్మ హాజరవుతారన్నారు.

మహిళా కళాకారులకు చీరల పంపిణీ
కర్నూలు కల్చరల్: దసరా పండగ సందర్భంగా జిల్లాలోని ప్రసిద్ధ రంగస్థల మహిళా కళాకారులకు శనివారం ఉదయం 10.30 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో చీరలు అందజేయనున్నట్లు కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం సభ్యులు తెలిపారు.

ముస్లింల ఆధ్యాత్మిక సమావేశం
కర్నూలు(రాజ్‌విహార్): మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం స్థానిక ఇస్లామియా అరబిక్ కళాశాల ఆవరణలో ముస్లింల ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు షావలి, జాకీర్ తెలిపారు.





సప్తగిరి నగర్ చౌడేశ్వరి దేవి ఆలయంలో..., గీతా మందిరంలో..



సూర్యనారాయణ స్వామి ఆలయంలో దర్శనం చేసుకుంటున్న భక్తులు

సరస్వతీ నమస్తుభ్యం



లలితా పీఠంలో సామూహిక కుంకుమార్చన

కర్నూలు కల్చరల్: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. నగరంలోని అమ్మవారి ఆలయాల్లో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయంలో మూల విరాట్‌ను పసుపు, గంధంతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పంచామృతాభిషేకాలు, హోమాలు, రథోత్సవం, పల్లకీ సేవ, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గా మాత విగ్రహాలకు పూజలు చేశారు. ఆధ్యాత్మిక నృత్యాలు, భక్తి సంగీత కచేరీలు, సంకీర్తనలు, కోలాటం, చెక్క భజన, హరికథలు, నవరాత్రులపై ప్రవచనాలు జరిగాయి. ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, పారిశ్రామిక వేత్త టీజీ భరత్ కల్లూరులోని కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠమహోత్సవం
కర్నూలు కల్చరల్: ఓల్డ్ సిటీలోని లలితా పీఠంలో శుక్రవారం శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తి శ్రద్ధలతో జరిగింది. వేద పండితులు మంత్రోచ్చారణలు, మేళ తాళాల సవ్వడులు, భక్తుల జయ జయ ధ్వానాల మధ్యలో విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, బజరంగ్ దల్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, మఠాధిపతులు పాల్గొన్నారు.